సీరియల్ (ఏడవ భాగం )

శ్రీధర



# శాంతిలేదు మనసుకు

ఉదయం పది గంటలు కాగానే సాయినాథ్ , దేవసేన ఎవరి ఆఫీసుకు వెళ్ళిపోయారు. చేతన్‌కి కబురు చేశాననీ వాడు తప్పకుండా వస్తాడనీ సాయినాథ్, తల్లికి చెప్పాడు. అందుచేత జ్యోతిర్మయి మనవడికోసం వంట చేసి రెడీగా ఉంచింది.

ఆమె ఎదురు చూసి ఎదురు చూసి కన్నులు కాయలు కాసి, కునికి పాట్లు పడే సమయంలో మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చాడు చేతన్. వచ్చి ఎదురుగా బిడియంగా కూర్చున్నాడు.

"ఏరా, ఎలా ఉన్నావు?" అని అడిగింది జ్యోతిర్మయి.

"బాగానే ఉన్నానండీ?"

"హాస్టల్ లైఫ్ ఎలా ఉంది?"

"బాగానే ఉందండీ...."

"ఫ్రెండ్స్ నీతో క్లోజ్‌గా ఉంటారా?" అని అడిగింది

అవునన్నట్లు తల ఊపాడు.

"ఇంట్లో ఉన్నట్లు ఉంటుందా?"

"పర్వాలేదు.... ఇట్స్ ఓ.కె ..."

"ఎలా చదువుతున్నావ్?"

"పర్వాలేదు..."

"నువ్వు ఏ రేంజ్‌లో ఉన్నావు? బ్రిలియంటా? ఎబౌవ్ ఏవరేజా? బిలో యావరేజా?"

"ఎబౌవ్ యావరేజ్..."

"డిగ్రీ అయ్యాక, ఏం చేద్దామనుకుంటున్నావు?"



"ఫ్యూచర్ ప్లాన్స్ ఏమి లేవు...."

"సర్లే... భోం చేద్దాం... లే..."

"మీరు చెయ్యండి... నేను మీల్స్ చేసొచ్చానండి..." అన్నాడు చేతన్.

"ఇందాకటినుంచీ చూస్తున్నాను... నన్ను అండీ అంటావేం?"

"పెద్దవారిని గౌరవించాలి... తాతగారన్నా, మీరన్నా నాకు భయం, భక్తీ రెండూ ఉన్నాయి..."

"చాలా సంతోషం... పెద్దవారిని గౌరవించటం మంచిదే వాళ్ళంటే భయం, భక్తి కూడా ఉండాలి... మరి మీ అమ్మా, నాన్న అంటే కూడా భయం, భక్తి ఉన్నాయా?"

చేతన్ సమాధానం చెప్పలేదు. వాడి మొహంలో రంగులు మారటం ఆమె గమనించింది.

"వాళ్ళంటే కోపమా?" అని అడిగింది.

దానికి సమాధానం చెప్పలేదు.

ఆమే అందుకుంది. "నీకు చాలా అన్యాయం చేశారు. ముఖ్యంగా నీకు పంచి ఇవ్వాల్సిన ప్రేమాభిమానాలను పంచి ఇవ్వటం లేదు. భార్యా భర్తలుగా వాళ్ళే ఒకరిమీద మరొకరు ప్రేమాభిమానాలు చూపించుకోవటంలేదు....."

"భార్యా భర్తలుగా ప్రేమాభిమానాలు చూపించుకునే టైమ్ లేదు వాళ్ళకు. మరొకరి భార్య మీద ఆయన, మరొకరి భర్త మీద ఆవిడా ప్రేమాభిమానాలు కురిపించటానికే ఇరువైనాలుగు గంటలూ సరిపోవటం లేదండి..." అన్నాడు చేతన్.

"వాళ్ళు చేస్తున్నది తప్పే. నీకు నాన్న కావచ్చుగానీ నాకు కొడుకు. నా దృష్టిలో వాడు ఎదిగిన పిల్లాడు. పిల్లలు తప్పులు చేస్తూనే ఉంటారు. Children break everything - especially Rules....ఎదిగిన పిల్లలూ తప్పు చేస్తారు. వయసు మళ్ళిన పిల్లలూ దారి తప్పుతుంటారు. తప్పు చేయటం మానవ స్వభావం క్షమించగలగటం దైవత్వం...."

"మీ వయసులో సగం వయసే మీ అబ్బాయికి ఉంది కాబట్టి మీరు క్షమించగలరు. దైవత్వం చూపగలరు... ఆయనుకున్న వయసులో సగం వయసు కూడా లేని నేను క్షమించి, దేవుడికి దగ్గర కాలేను... ముఖ్యంగా ఇంత చిన్న వయసులో.." అన్నాడు చేతన్

వాడి మనసులో తల్లిదండ్రుల మీద ఎంత కోపం ఉందో ఆమాటల్ని బట్టి జ్యోతిర్మయికి అర్థమవుతూనే ఉంది.

"వాళ్ళను నువ్వు క్షమించకపోయినా ఫర్వాలేదు. కాని నువ్వు ద్వేషంతో రగిలిపోవద్దని మాత్రమే చెపుతున్నాను. ఎందుకంటే అగ్ని ఎక్కడుంటే అక్కడ దహించి వేస్తుంది. అది దాని నైజం..." అని ఆమె పెద్దరికాన్ని చూపి సర్ది చెప్పేందుకు ప్రయత్నించింది.

"ఎవరి స్వార్థం వాళ్ళది. అడవిలో జంతువులకు విశృంఖలంగా తమ ఆకలి తీర్చుకోవటం, తమ కామదాహం తీర్చుకోవటం మాత్రమే తెలుసు. నాగరికత బలిసిపోయిన మహా నగరాల్లో తిరిగే వీళ్ళల్లోనూ ఈ జంతు ప్రవృత్తి పోవటం లేదు. అలా అని కట్టుబాట్లు తెంచేసుకుని ప్రవర్తిస్తున్న వీళ్ళు ఎవరిదోవన వాళ్ళు బతుకుతున్నారా అంటే అదీ లేదు. మళ్ళీ అన్యోన్య దాంపత్యం వెలగబెడుతున్న వారిలాగా ఇల్లూ, వాకిలీ, ఆస్తిపాస్తులు, హక్కులూ - అన్నీ కావాలి. ఈవిడ తిరుగుళ్ళ గురించి ఆయనకు తెల్సు, ఆయన అక్రమ సంబంధం గురించి ఈవిడకు తెలుసు. వీళ్ళిద్దరి బాగోతం దేశమంతా తెలుసు... అయినా ఒకరి స్వేచ్ఛకు మరొకరు అడ్డురావటం లేదు గనుక వదిలేసి ఊరుకుంటున్నారు. ఇంట్లో బద్ధ శత్రువుల్లా ఉంటూ, పైకి అన్యోన్యంగా ఉన్న దంపతుల్లా నటిస్తున్నారు. వీళ్ళు ఎంత గొప్ప నటులో దేశమంతా తెల్సినా, ఆ ఆత్మవంచనా, పరవంచనా దేనికో అర్థంకాదు..." అన్నాడు చేతన్.

"పిల్లలు చెడిపోతుంటే తల్లిదండ్రులు బుద్ధిచెప్పాలి. కానీ ఇక్కడ తల్లిదండ్రులు చెడిపోతుంటే పిల్లలు బుద్ధి చెప్పాల్సివస్తోంది. ఈ సమాజం ఎటుపోతుందో, ఏమై పోతోందో తెలియటం లేదు" అని నిట్టూర్చింది జ్యోతిర్మయి.

ఆమె లేచి డైనింగ్ టేబుల్ దగ్గరకెళ్ళి రెండు ప్లేట్లలోనూ వడ్డించింది. చేతన్ తను భోంచేసి వచ్చానని చెప్పినా ఆమె వినలేదు.

"ఈ ఒక్కపూటకీ నా చేతి వంట కూడా తినరా..." అంటూ ప్రేమగా మనవడ్ని డైనింగ్ టేబులు దగ్గరకు తీసుకెళ్ళి కొసరి కొసరి వడ్డించింది.

"వంటకాలు ఎలా ఉన్నాయిరా..."

"చాలా బావున్నాయి బామ్మగారూ..."

"ఇంకొంచెం వడ్డించమంటారా మనవడుగారూ..."

"వద్దండీ..."

"నోరు మూసుకుని తినండీ..."

"నోరుమూసుకుని ఎలా తింటామండీ..... తిట్లూ, చీవాట్లూ అయితే తప్ప..."

"రేయ్, నువు ఎవరి తిట్లూ, చివాట్లూ తినాల్సిన పనిలేదు.... నీతాత ఈ దేశ రక్షణ బాధ్యత వహిస్తున్న సైనికాధిపతి.... ఆయన ఈ జాతి పౌరుషానికీ, రోషానికీ ప్రతినిధి..... నీ బామ్మ లక్షలాదిమంది అభిమాన రచయిత్రి.

మేం నీకు కొండంత అండగా ఉన్నాం. You forget about other things..." అని చెప్పింది.

ఇద్దరూ భోజనాలు ముగించి వచ్చి సోఫాలో కూర్చున్నారు. చేతన్ టీ.వీ. ఆన్ చేశాడు.

"నీ హాబీలు ఏమిటా?" అని అడిగిందామె.

"ఏమీ లేవు" అని చెప్పాడు.

"మరి ఖాళీ సమయాల్లో ఏం చేస్తావు?"

"ఏం లేదు... కాసేపు అలా తిరిగొస్తాం.... ఏదన్నా పిక్చర్ కెళ్తాం... హోటలు కెళ్తాం.... ఫ్రెండ్స్‌తో హస్కు కొడతాం...."

" మీరు క్లాసులకు వెళ్ళే టైం రోజుకి ఎంత ఉంటుంది?"

"సీరియస్‌గా పాఠాలు చెప్పేది రోజుకు మూడు నాలుగు గంటలకన్నా ఎక్కువుండదు..."

"హోం వర్క్ ఎంతసేపు చేస్తావు?"

"వన్ అవర్ కూడా ఉండదు...."

"మొత్తం మీద చదువుకు కేటాయించే సమయం రోజుకి అయిదు గంటలకన్నా ఎక్కువ టైం ఉండదు. చదువుగాక మిగతా హాబీలున్నాయా అంటే, రోడ్ల మీద తిరగడం హోటల్స్‌కు, సినిమాలకు వెళ్ళటం తప్ప మరో పని లేదు.... అవునా?" అని అడిగింది.

"నేనే కాదు... స్టూడెంట్స్ ఎవరైనా అంతే.... వుయ్ వాంట్ టు ఎంజాయ్ లైఫ్" అని నవ్వాడు చేతన్.

"వాళ్ళ సంగతి వదిలేయ్. నీకు ఎలాంటి కోరికలున్నాయి?"

"నాకే కోరికలూ లేవు...."

"ఇది మొదటి లోపం..."

"అది లోపం కాదు. పరిస్థితులను అర్థం చేసుకుని మసులుకోవటం... నాకు అనిల్ అంబానీ అవ్వాలని ఉంటుంది. కానీ ఏం లాభం? కాగలనా?"

"అనిల్ అంబానీ నీలాగా రోజుకు పన్నెండుగంటలు రోడ్ల మీద తిరుగుతూ, హోటల్స్ చుట్టూ, సినిమా హాల్స్ చుట్టూ తిరుగుతున్నాడా? గొప్పవాళ్ళు ఎప్పుడూ టైం వృధా చేయరు. డబ్బు కన్నా విలువైనది సమయం.... అనిల్ అంబానీ తండ్రి అంత పెద్ద సామ్రాజ్యాన్ని అలా సృష్టించాడో గమనించావా? జీవితంలో అట్టడుగు స్థాయినుంచీ ప్రారంభించి, అత్యున్నత శిఖరాలను చేరుకున్న వాళ్ళు ఎందరో ఉన్నారు.... వాళ్ళెవరూ రోజుకు పన్నెండుగంటలు టైం వేస్ట్ చేయరు... .

"ఒక నిరుపేద కుర్రాడు పదో తరగతి చదువుతూ, స్కూలు మానేసి ఒక పెద్ద కంపెనీలో ఆఫీసు బాయ్‌గా చేరాడు. ఆ కుర్రాడు తన పని చేయటంతో ఊరుకోక, తమ సెక్షన్‌లో మిగిలిన వాళ్ళందరూ ఎలా పనిచేస్తున్నారో గమనించి, ఎన్నో విషయాలు తెల్సుకోవటం మొదలుపెట్టాడు. శ్రద్ధగా పని చేస్తాడన్న పేరు తెచ్చుకున్నాడు. అంతటితో ఆగలేదు. తన ఫాక్టరీలోఆ వస్తువులు ఎలా తయారవుతున్నాయో తెల్సుకోవాలన్న ఆసక్తి కలిగింది. తన 'వీక్లీ హాలిడే' నాడు ఫాక్టరీలోకి వెళ్ళి అన్ని విభాగాలు చూసి వచ్చేందుకు అనుమతించమని దరఖాస్తు పెట్టుకున్నాడు. ఆ సెక్షన్ అధిపతి అతని అభ్యర్థనను ఆమోదించాలని సిఫార్సు చేశాడు. ఈ విషయం డైరక్టర్స్ అందరి దృష్టికీ వెళ్ళింది. అతనికి అనుమతి మంజూరు అయింది.

"వీక్లీ హాలిడే నాడు అతను ఫాక్టరీలో ఒక్కొక్క విభాగానికే వెళ్ళి వాళ్ళు పని చేసే పద్ధతిని తెల్సుకుని వాళ్ళతో పరిచయం పెంచుకున్నాడు. ఒక ఏడాది గడిచేటప్పటికి తమ కంపెనీ ముడిసరుకు సేకరించటం దగ్గరనుంచీ, తమ ఉత్పత్తులను ఎలా మార్కెటింగు చేయగలుగుతుందో - వరకు క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్నాడు.

"ఆ కంపెనీలో గుమాస్తా ఉద్యోగాలకు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చినప్పుడు, అతనూ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నాడు. రాత పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకున్నాడు. గుమాస్తా ఉద్యోగంలో చేరిన తరువాత కూడా రోజూ కొన్ని గంటలపాటు తమ కంపెనీకి సంబంధించిన వ్యాపారలావాదేవీలు తెలియజేసే పుస్తకాలు చదివేవాడు. సాటి గుమస్తాలు వెక్కిరించేవారు. అతను లక్ష్యపెట్టలేదు.

"మేనేజరు పోస్ట్‌లకు ఖాళీలు వచ్చినప్పుడు, ఆ పరీక్షలకు హాజరై, ఆ ఉద్యోగం సంపాదించాడు. కొద్ది సంవత్సరాలకే ఆ కంపెనీ మేనేజింగ్ డైరక్టరు అయ్యాడు.... ఒక ఆఫీసు - బాయ్ మేనేజింగ్ డైరక్టర్ కావటం అసాధ్యమని అతను అనుకోలేదు. సాధ్యం అనుకున్నాడు కాబట్టే సాధించగలిగాడు..." అని చెప్పింది జ్యోతిర్మయి.

మౌనంగా వింటున్నాడు చేతన్. మళ్ళీ ఆమే అన్నది.

" Life is what you make it...."

"unless others speril it..." అని ముక్తాయింపు ఇచ్చాడు చేతన్ - ఆమె చెప్పినదంతా ఒక్క ముక్కలో కొట్టేస్తూ.

"మరొకరు మన జీవితాన్ని పాడు చేసే అవకాశం ఎందుకు ఇవ్వాలి? ప్రతి పనిలోనూ కష్టాలుంటాయి.... అవాంతరాలు ఎదురవుతుంటాయి..... ఎప్పటి కప్పుడు వాటిని అధిగమించుకుంటూ పోతుండాలి... అదే కార్యసాధకుడి లక్షణం.... భర్తృహరి ఏమన్నాడు... ఒకచో నేలను పవ్వళించు, నొకచో నొప్పారు బూసెజ్జపై... లెక్కకు రానీయడు కార్యసాధకుడు, దుఃఖంబున్, సుఖంబున్ మదిన్... అన్నాడు. కనుక ఇకనుంచీ పనికి రాని చెత్త విషయాల గురించి పట్టించుకోకు. మీ అమ్మ ఎవడితో స్కూటరు మీద వెళ్తేనీకెందుకు? మీ నాన్న ఎవతె ఇంట్లో తెల్లవార్లూ ఉంటే నీకెందుకు? ఎవడో ఏదో వాగితే, నువ్వు విని కుచించుకు పోవటం ఎందుకు? ఎవడి జీవితం వాడిది..... నీ జీవితాన్ని నీఇష్టం వచ్చినట్లు తీర్చిదిద్దే ప్రయత్నం చెయ్యి... అందుకు నీకేం కావాలో చెప్పు.... నువ్వు అడిగినవన్నీ ఇవ్వటానికి నేను ఉన్నాను... ఒట్టిమాటలతో కాదు, చేతలతో చెబుతున్నాను... ఇదిగో ఈ లక్షరూపాయలు తీసుకో... నీ పేర బ్యాంకులో వేసుకో.... నీకు మంచె డ్రెస్సులు కావాలో, స్కూటర్ కావాలో, కారుకావాలో కొనుక్కో - దేనికీ లోటు ఉండకూడదు.... నువ్వు అడిగినంత డబ్బు ఇస్తాను.... కానీ నువ్వు నాకో మాట ఇవ్వాలి..." అని ఆగింది ...

"ఏమిటది?" అని అడిగాడు చేతన్.

"నువ్వు రోజుకు వృధా  చేసే పన్నెండు గంటలలో సగం సేపు అంటే రోజుకు అయిదారుగంటలు క్లాసు పుస్తకాలు కాక, విజ్ఞానాన్ని పెంచే ఇతర పుస్తకాలు చదవాలి.... మిగిలిన ఆరుగంటలూ ఆలోచించాలి. మనసుకు పదును పెట్టాలి... కాలేజీ చదువే చదువు కాదు... '1880లో హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి పట్టాతీసుకున్నాను. ఆ తరువాత నుంచీ నా  విద్యాభ్యాసం ప్రారంభమైంది....' అంటారు రూజ్‌వెల్ట్. ఆయన జీవితాంతం పుస్తకాలు చదువుతూనే ఉన్నాడు.. నేను నీకు సెల్‌ఫోన్ ఇస్తాను... రోజూ నాకు చెప్పాలి... నువ్వేం చేసిందీ... ఏం చదివిందీ... సరేనా?" అన్నది జ్యోతిర్మయి.

చేతన్ మౌనంగా అంగీకరించాడు.

